# నడవండోయ్. ★

“ సేవాసమితి ”

నడవండోయ్
    నడవండీ
స్వరాజ్యపథమున
    నడవండీ
హింసాతత్వము
    హీనుల మతమని
ఎంచి చరించే
    గాంధీ వెంటను. 1

నడవండోయ్
    నడవండీ
స్వరాజ్యపథమున
    నడవండీ
యోధాగ్రేసర
    యువజననాయక
మణియైవెలిగెడు
    జవహరువెంటను. 2

నడవండోయ్
    నడవండీ
స్వరాజ్యపథమున
    నడవండీ
హిందూ ముస్లిం
    ఐక్యతయిదిగో
ముందుకుపొండను
    అజాదువెంటను. 3

నడవండోయ్
    నడవండీ
స్వరాజ్యపథమున
    నడవండీ
కూలీరైతుల
    రాజ్యముకోసం
కుమిలికృశించే
    రంగావెంటను. 4

నడవండోయ్
    నడవండీ
స్వరాజ్యపథమున
    నడవండీ
దేశవినాశక
    వర్గముతలపై
గుండనజెల్లెడు
    సుభాషువెంటను. 5

నడవండోయ్
    నడవండీ
స్వరాజ్యపథమున
    నడవండీ
మ్రోగిందీ
    జయభేరి.

కార్డుకథ

## వ్యత్యాసాలు

వేట....

పెద్దపులుల వేట....

పెద్దపులుల వేటకు పెదబాబుగారు బయలుదేరారు పెద్దబాబూగారు పెద్ద జమీందారుగారి ఏకైక పుత్రుడు. అల్లారు ముద్దుగా పెరిగాడు. అందరు పెద్దబాబును ‘శ్రీవారు’ అని పిలుస్తారు.

శ్రీవారు వేటకు బయలుదేరారు. వూరంతా చాటింపు వేయించారు, హారతులతో అందరినీ సిద్ధంగా వుండమని. రాజుగారు తలచుకొంటె దెబ్బలకేం కొదవ!

డప్పులు వాయించేవారు.... కాగడాలు పట్టేవారు.... విలువిద్యలో ఆరితేరినవారు.... కత్తి విసరులో మొనగాళ్లు.... ఈటె విసరులో పేరుమోసినవారు.... జాగిలాలను ఉసికొల్పటంలో ఆరితేరినవారు.... పట్టుమని పందమంది అట్టహాసంగా అడవిలో ప్రవేశించారు.

శ్రీవారు ఎక్కిన ఏనుగు మధ్యవుంది. నాలుగు వైపులా, నలుగురు వేటలో ఆరితేరినవారు ఏనుగలెక్కి వస్తున్నారు. ఏనుగలు సాగుతున్నాయి. “ఓ దొరో, అదిగో పులి” అంటూ పొదలో పులిని చూపాడు ఒకతను. విలుకాండ్రు విల్లెక్కుపెట్టారు. ఈటెలవారు ఈటెలను గురిచూచి నిలబడ్డారు. కుక్కలు సంజ్ఞకోసం వేచివున్నాయి. శ్రీవారు తుపాకి ఎక్కుపెట్టారు. ఆజ్ఞ ప్రకారం పులిమీద రాయి విసిరాడు. కొండ్రుమని లేచింది పులి. బాణాలు.... ఈటెలు పొల్లుపోయాయి, శ్రీవారి తుపాకి గురి తప్పింది. లేచిన పులి శ్రీవారిమీద పడబోయే సమయంలో, శ్రీవారికి నాలుగువైపులావున్న వేటకాండ్రు పులిని బల్లేలమీద నిలబెట్టారు. శ్రీవారికి గండం తప్పింది! అంతా ఆనందం!

విజయంతో పురం ప్రవేశించాక చచ్చిన పులిమీద శ్రీవారి కుడికాలు పెట్టించి, ఎడమ చేత్తో తుపాకి పట్టించి, ఫోటోతీసి, పత్రికల్లో ప్రకటించారు.... శ్రీవారి ముఖం ఆనందంతో స్పందించింది.... పులిని చంపిన వేటకాండ్రలోని బానిసత్వం ఆనందంతో తొంగి చూచింది—

ముసలి జమీందారు మీసం మెలివేశాడు.

—యరబర్ల శ్రీరామమూర్తి